క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):సీతారాంపురం సబ్‌స్టేషన్ సూర్యారావుపేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డీఈ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాఅగ్రహారం కాలువగట్టు, సీతారావపురం, వీఎంసీ డ్రైనేజీ, కొత్తవంతెన రోడ్డు, జనతా ప్రైస్ రోడ్డు, కాట్రగడ్డ వారి వీధి, అంకమ్మ తల్లి టెంపుల్ ఏరియా, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, జగడం వారి వీధి, వేమూరి వారి వీధి, ఏలూరు రోడ్డు, ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియా, డోర్నకల్ రోడ్డు, వీధిరాజు మేడ ఏరియా, గోపరాజు రామచంద్రరావు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా 58వ డివిజన్ 5వ సెక్టార్ బాలభవన్‌లో చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీశైలజ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆహారం విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.

కాపుల అభ్యున్నతికి సీఎం జగనన్న కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కాపుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి అంజిబాబు అన్నారు. కాపునేస్తం పథకం ద్వారా కాపు మహిళలకు నాలుగో విడత రూ.15 వేలు నేరుగా వారి బ్యాంక్ ఎకౌంట్లలో జమ కావడాన్ని హర్షిస్తూ 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములతో కలిసి కండ్రిక సెంటర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో కాపు నేస్తం నాలుగో విడత ద్వారా 2583 మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు. ఈ పథకం ద్వారా నిరుపేద కాపులందరికీ ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. కాపుల అభ్యున్నతి కోసం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలోని కాపులంతా రుణపడి ఉంటామన్నారు. ముందుగా సీఎం వైఎస్ జగన్, వంగవీటి మోహనరంగా చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, జిల్లెల శివ, బొర్రా బుజ్జి, నాగు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కావడంతో వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన భవానీపురం స్టేషన్ పరిధిలోని లేబర్ కాలనీలో చోటు చేసుకుంది. సయ్యద్ ఇమ్రాన్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం బాగోలేదని ఈ నెల 18న ఆసుపత్రికి వెళ్లాడు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. బుధవారం వైద్య పరీక్షల నివేదికలు రావడంతో ఆసుపత్రికి వెళ్లాడు. అతనికి క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. ఇంటికి వచ్చి విషయం తండ్రి, బావకు చెప్పాడు. ఆ తర్వాత ఇంటి నుంచి వెళ్లి పోయాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా లిఫ్ట్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం బంధువులు, చుట్టు పక్కల ఇళ్లలో వెదికారు. ఆచూకీ తెలియకపోవడంతో సయ్యద్ ఇమ్రాన్ తండ్రి ఇస్మాయిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులకు అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్):వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భగవాన్ షిరిడీ సాయిబాబా మందిరంలో దాత టి.దుర్గా మల్లికార్జున ప్రసాద్ సహకారంతో అన్న ప్రసాద వితరణ జరిగింది. తొలుత గణపతికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎస్ రాజు, శివాజీ, బాలవర్ధనరావు పర్యవేక్షించారు. పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం దాత దోనేపూడి నాగేశ్వరరావు, ముక్కామల శ్రీనివాసరావు దంపతుల సహకారంతో అన్న ప్రసాద వితరణ జరిగింది. సుమారు 500 మంది తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నగరంలో స్వచ్ఛత సేవా ర్యాలీలు



సర్కిల్ -1లో ర్యాలీ ప్రారంభిస్తున్న బండి పుణ్యశీల



సర్కిల్-2లో పాల్గొన్న డెప్యూటీ మేయర్ అవుతు శైలజరెడ్డి

పటమట(విజయవాడతూర్పు):వీఎంసీ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా సేవా లీగ్ 2.0లో భాగంగా గురువారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని మూడు సర్కిళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ విద్యా సంస్థల విద్యార్థులు మానవహారం, ర్యాలీల నిర్వహణ, పరిసరాలను శుభ్రం చేశారు. సర్కిల్-1లో 34వ డివిజన్ కార్పొరేటర్ - ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల సౌజన్యంతో మీసాల రాజారావు బ్రిడ్జి, ఫ్రూట్ మార్కెట్ ఏరియా, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో భవానీపురంలోని భవానీ ఘాట్ దగ్గర నారాయణ కళాశాల, ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల వద్ద, సర్కిల్-2 పరిధిలోని 58 వ డివిజన్ కార్పొరేటర్ - డెప్యూటీ మేయర్ అవుతూ శైలజరెడ్డి, 59 వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ షాహీనా సుల్తానా, 36 వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవిందు సహకారంతో ఎంకే బేగ్ పాఠశాల, వివేకానంద, శారద కళాశాల విద్యార్థులు, సర్కిల్-3 జోనల్ కమిషనర్-3 కృష్ణ ఆధ్వర్యంలో పటమట రైతు బజార్ వెంబడి ఉన్న ఇండోర్ స్టేడియం దగ్గర విశ్వభారతి పాఠశాల, విద్యార్థులతో కలిసి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న వీఎంసీ ప్రజారోగ్య విభాగం ప్రధాన అధికారి డాక్టర్ పి. రత్నావళి విద్యార్థులకు, ప్రజలకు, వ్యాపారులకు స్వచ్ఛత సేవ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లలోని ప్రధాన కాల్వలను, డ్రైనేజీలను శుభ్రపరుస్తూ నీటి నీటిపారుదల ఉండేలా తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు.



సర్కిల్-3లో విద్యార్థులతో జోనల్ కమిషనర్ కృష్ణ తదితరులు

సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతాహి సేవ జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్ జరుపుకోవాలని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ ఏడాది ప్రధాన ఇతివృత్తం చెత్త రహిత భారతదేశమని చెప్పారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కంటోన్మెంట్ బోర్డులు, బీచ్‌లు, పర్యాటక ప్రదేశాలు, జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు - అభయారణ్యాలు, చారిత్రక స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, రివర్ ఫ్రంట్లు, ఘాట్లు, డ్రెయిన్లు, నల్లాలు మొదలైన జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలపై స్వచ్ఛతా డ్రైవ్‌లు నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో స్వచ్ఛత ఈ సేవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ -1 సురేష్ బాబు, హెల్త్ ఆఫీసర్ -2 రామకోటేశ్వరరావు, హెల్త్ ఆఫీసర్ -3 ఇక్బాల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అంబేడ్కర్ స్మృతి వనం పనులు



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్యమైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. విగ్రహం కాంస్య పెయింటింగ్, థియేటర్ లోపల మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హరితహారం వెదురు ఫ్రేమ్‌లో మొక్కలు నాటుతున్నామని, చుట్టూ గులకరాళ్లను ఏర్పాటు చేయాలని, ఆయా ప్రదేశాల్లో రంగురంగుల పూల మొక్కలు పెట్టాలని చెప్పారు. వాటర్ ఫౌంటేన్ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. స్వరాజ్య మైదానం చుట్టూ ఫుట్‌పాత్ పనులను పరిశీలించి వేగంగా చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మైదాన ప్రాంగణం బ్యూటిఫికేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ కె. అనిల్ కుమార్ మేనేజర్ కె. కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు):సెంట్రల్ నియోజకవర్గంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఉదయం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. నియోజకవర్గంలోని 28 వ డివిజన్ సత్యనారాయణపురం బి.ఆర్.టి.ఎస్. ఫుడ్ కోర్ట్ దగ్గర వెనుకవైపు ఉన్న రైల్వే కమ్యూనిటీ హాల్స్, 23 వ డివిజన్ డీసీపీ ఆఫీసు ఎదురుగా ఉన్న రైల్వే కమ్యూనిటీ హాల్లోని పోలింగ్‌స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎన్నికల అధికారులకు సూచించారు. ఓటర్లు, ఎన్నికల సిబ్బంది భద్రతపై ప్రతి పోలింగ్ స్టేషన్‌లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, సీటింగ్ ఏర్పాట్ల లభ్యతను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మరమ్మతులు ఉంటే సంబంధిత ఏఈల దృష్టికి తెచ్చి పరిష్కరించాలని ఆదేశించారు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌లో నిర్వహణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): అత్యంత క్లిష్టతరమైన గుండె సమస్యలున్న 8 మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు విజయవాడ ఆంధ్రా హాస్పిటల్ పీడియాట్రిక్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. యూకే చారిటీ, హీలింగ్ లిటిల్ హార్ట్స్ సౌజన్యంతో ఈ శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అత్యంత క్లిష్టతరమైన ట్రాన్స్ పొజిషన్ ఆఫ్ గ్రేట్ ఆర్టరీస్, టెట్రాలీ ఆఫ్ ఫాలో ఆబ్సెంట్ పల్మనరీ వాల్వ్, టెట్రాలజీ ఆఫ్ ఫాలో డబుల్ అవుట్‌లెట్ రైట్ వెంట్రికల్, సింగిల్ వెంట్రికల్ ఫిజియాలజీ వంటి గుండె సమస్యలతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సర్జరీలను యూకేలోని లివర్ పూల్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ రమణ నన్నపనేని, ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ దిలీప్ నిర్వహించారని చెప్పారు. తమ ఆస్పత్రిలో యూకే లిటిల్ హార్ట్స్ ఆధ్వర్యంలో ఇప్పటివరకూ 26 ఉచిత గుండె వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 3500 మందికి గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో యూకేకు చెందిన డాక్టర్ రమణ నన్నపనేని, ఆంధ్రా హాస్పిటల్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ దిలీప్, కార్డియాలజిస్ట్ డాక్టర్ జె.శ్రీమన్నారాయణ, డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంధ్రా హాస్పిటల్ పీడియాట్రిక్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ పీవీ రామారావు, వైద్యులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వీణానాదం చేస్తున్న నందినీ శ్రీనివాస్



శ్రీనగర్ కాలనీలో పారాయణం చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్):వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. శ్రీనగర్ కాలనీలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ కటారి వెంకట సాయి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన పారాయణం జరిగింది. శ్రీసాయినక్షత్రమాలిక మండలి సభ్యుల పారాయణం భక్తులను భక్తి తన్మయత్వంలో తేలియాడించాయి. కార్యక్రమాలను నిర్వాహకులు ఏపుగంటి సాయికృష్ణ పర్యవేక్షించారు. దావుబుచ్చయ్యకాలనీ 9వ లైనులో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా వీణాధారి సంగీత శిక్షణ సంస్థ నిర్వాహకురాలు సుశర్ల నందినీ శ్రీనివాస్, చిన్నారులచే వీణానాదం జరిగింది.

నగరంలో రేపు జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విజయవాడ గాయత్రినగర్‌లోని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ కార్యాలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ సీహెచ్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలైన టీసీఎస్ ఐకాన్, రైటర్, నవత, మెడిప్లస్, సుస్వదీప్, ఆగ్రో, లాట్, వీల్స్‌మార్ట్, ఇన్నోవ్ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై సుమారు 500 పోస్టులను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, బీటెక్ పూర్తి చేసిన యువత ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 96769 55667 నంబర్లో సంప్రదించాలని కోరారు.

కమిషనర్ నిర్ణయాలు అభినందనీయం



కమిషనర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ షాహీనా సుల్తానా హాఫీజుల్లా దంపతులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):నగరాభివృద్ధికి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని, విజయవాడ ముఖచిత్రాన్ని మార్చేందుకు ఆయన చూపుతున్న చొరవ నగర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గుర్తుండిపోతాయని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా అన్నారు. కమిషనర్‌ను గురువారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కమిషనర్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని మూడు ప్రధాన కాలువలను ఆధునికీకరించడం, నగర శివారు ప్రాంతమైన అజిత్‌సింగ్‌నగర్ పరిసర ప్రాంత ప్రజలకు దీర్ఘకాలిక సమస్యగా ఉన్న చెత్త డంపింగ్ యార్డ్ ను ఉద్యానవనంలా, నందనవనాన్ని తలపించే విధంగా చక్కదిద్దడం, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పరిసరాల శుభ్రతకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. అనుక్షణం నగరాభివృద్ధి కోసం పరితపిస్తున్న ఆయన అభినందనీయులని తెలిపారు.

మతి మరుపు వ్యాధిని మొదటి దశలో గుర్తిస్తే మేలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మతిమరుపు వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి మందులు వాడితే తీవ్రరూపం దాల్చకుండా కాపాడుకోవచ్చని వైద్యులు అయోధ్య ఆర్.కె అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో అల్జీమర్స్ డే సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మానస కాజ, అయోధ్య ఆర్. కె మాట్లాడుతూ అల్జీమర్స్ వ్యాధి గురించి తెలుసుకోవాల్సిన అవశ్యకత, అవసరాన్ని వివరించారు. మతి మరుపు జబ్బులు చాలా రకాలుగా ఉంటాయన్నారు. సాధారణంగా అల్జీమర్స్ 65 సంవత్సరాలు పైబడిన వారిలో వస్తుందన్నారు. ఈ జబ్బు ఆలోచన విధానం, ప్రవర్తనపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మగవారి కంటే ఆడవారిలో ఈ జబ్బు అధికంగా వస్తుందన్నారు. వ్యాధి కారణాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉదాహరణలతో వివరించారు.

25న సీనియర్ రెసిడెంట్స్‌కు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్స్ నియామకం కోసం ఈ నెల 25న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసిన వారు కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు www.rmc.vja.in ను వీక్షించవచ్చన్నారు.

గాన గంధర్వుడు ఘంటసాల

విజయవాడ కల్చరల్: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని సీనియర్ గాయకుడు రామనాథం అన్నారు. అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండంలోని నిర్వహిస్తున్న గణపతి నవరాత్రుల్లో గురువారం ఘంటసాల గాన వైభవం అంశంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల గానం చేసిన భక్తి గీతాలు తరాలు మారుతున్నా గీత వైభవం మారలేదన్నారు. ఆయన స్వరపరచి గానం చేసిన పలు భక్తి గీతాలను ఆలపించారు. అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, సంస్థ అధ్యక్షుడు ఊటుకూరు పార్థసారథి కోశాధికారి అనుముల సోమశేఖర్ పాల్గొన్నారు.

గొప్ప సాహితీకారుడు గురజాడ



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో గురజాడ అప్పారావు స్థానం మరువలేనిదని మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు అన్నారు. ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం 75వ వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం మహాకవి గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాలయం కార్యదర్శి పీవీ సుబ్బరాజు, ఎస్.వెంకటేశ్వరరాజు, డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజుతో కలిసి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి, హేతువాది అన్నారు. 19వ శతాబ్దంలోను, 20 వ శతాబ్ది మొదటి దశకంలోనూ ఆయన చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయన్నారు. ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేసారని పేర్కొన్నారు. కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో కె. ప్రసాదరాజు, డీజే పీఎన్ రాజు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొని గురజాడ సేవలను కొనియాడారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

గురజాడ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రముఖ సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గుర్రం ఏడుకొండలు అన్నారు. దుర్గాపురంలో గురువారం గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్లబ్ సభ్యులు బ్రహ్మదేశం వసంతకుమార్, కె.రాములతో కలిసి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాల అప్పారావు చేసిన సేవలను కొనియాడారు. అనేక సాంఘిక దురాచారాలు రూపుమాపేందుకు తన రచనల ద్వారా కృషి చేసిన మహనీయుడు గురజాడ అని కొనియాడారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎక్స్ రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, కనుమూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



ఇందిరా ఎన్‌క్లేవ్‌లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సింధూర అలంకారంలో విజయ గణపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్):వినాయక చవితి వేడుకల్లో భాగంగా అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం శ్రీధర్మ పరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన విజయ గణపతికి సింధూరంతో అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విజయగణపతిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. గణపతి ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. ఇందిరా ఎన్‌క్లేవ్‌లో జరిగిన వినాయక చవితి వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో పసుమర్తి కామేశ్వర శర్మ, శరత్, గుండే సుందర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. అయోధ్యనగర్‌లో ఓం శ్రీ శక్తి గణపతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ నాయకులు ఒగ్గు గవాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. శుక్రవారం అన్నదానం, శనివారం లడ్డూ వేలం పాట నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు చింత పెద్దిరాజు తెలిపారు. మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో వినాయక చవితి ఉత్సవాల్లో గుణదల సీఐ పి.కృష్ణమోహన్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అంగిరేకుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు



మాట్లాడుతున్న బండారు నరసింహారావు, వేదికపై డేవిడ్‌రాజు, ఆనంద్ , నృత్య కళాకారులు

విజయవాడ కల్చరల్: నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు బండారు నరసింహారావు అన్నారు. విజయశ్రీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి, సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనలు, అక్కినేని పేరుతో పురస్కారాల ప్రదానం కార్యక్రమం నిర్వహించింది. నరసింహారావు మాట్లాడుతూ అక్కినేని యుగం తెలుగు సినిమా స్వర్ణయుగమని తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ అక్కినేని స్వయం కృషితో నటుడిగా జీవితం ప్రారంభించి విభిన్న పాత్రలు పోషించి నిర్మాతగా, స్టూడియో అధినేతగా అనేక చిత్రాలను నిర్మించినట్లు తెలిపారు. సినీ నటుడు కొప్పుల ఆనంద్ మాట్లాడుతూ అక్కినేని నటజీవితం తెరచిన పుస్తకంగా అభివర్ణించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా మధురిమ బృందం సంప్రదాయ కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. పవన్‌కుమార్, స్వాతి, రెహానా, తదితరులు అక్కినేని నటించిన చిత్రాల్లోని గీతాలను మధురంగా ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన 120 మందికి నిర్వాహకులు పురస్కారాలు ప్రదానం చేశారు. నృత్యాలను ప్రదర్శించిన చిన్నారులకు జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలు అందజేశారు. సంస్థ సభ్యులు బి. నళిని, దుర్గ, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల్లో అనేక పోషక విలువలు



లబ్బీపేట(విజయవాడతూర్పు):చిరుధాన్యాల్లో అనేక పోషక విలువలు ఉంటాయని, వాటి వాడకంపై అవగాహన పెంచుకోవాలని అర్బన్ డీఐ రవికుమార్ అన్నారు. నేషనల్ సైన్స్ సెమినార్ -2023ను పురస్కరించుకుని విజయవాడ అర్బన్, రూరల్ స్థాయి సైన్స్ సదస్సు గురువారం బిషప్ అజరయ్య పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం (ఎన్‌సీఎస్ఎం), విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం (వీఐటీయం) బెంగళూరు వారి ఆధ్వర్యంలో చిరుధాన్యాలు పోషక విలువలు కలిగిన ఆహారం అనే అంశంపై జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ ఎంఈఓ విజయరామారావు, స్కూల్ హెచ్ఎం జయశ్రీ, జిల్లా సైన్స్ అధికారి ఎం హుస్సేన్ పాల్గొన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించగా విజయవాడ పట్టణ, రూరల్ పాఠశాలల నుంచి 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రూరల్ నుంచి జి.సంధ్య, అర్బన్ నుంచి కె.కృతిక, వినూత్న, పి.షణ్ముఖప్రియ, ఎ.అంజలి, టి. తేజశ్విని, ఎస్. లోహిత విజేతలుగా నిలిచారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా యస్.రమేష్, బి.ప్రసాద్, మన్మథ, ప్రభాకర్ వ్యవహరించారు.